■ భమిడిపాటి జగన్నాథరావు

# వెలుగు

నాకు నారాయణ స్వామి పరిచయం దాదాపు యాభై అయిదేళ్ళ క్రితం కలిగింది. స్వామితో ఆ నా పరిచయం క్రమంగా మా సాన్నిహిత్యానికి దారితీసింది. ఇన్నేళ్ళలోనూ నేను, స్వామి చాలాకాలం ఒకే చోట ఉండడం మా దగ్గరతనానికి సాయపడింది.

నా అయిదో ఏట మా అమ్మ, నాన్న నన్ను మా తాతయ్య, అమ్మమ్మ దగ్గర ఆ పల్లెటూర్లో దిగబెట్టారు. ఇక అక్కడే ఉండాలనీ, చదువుకోవాలనీ చెప్పారు. మా అమ్మ నా కన్నీళ్ళు తుడుస్తూ, వీపు నిమురుతూ సముదాయించింది. అమ్మా, నాన్నగారు నాలుగో రోజు వెళ్ళిపోయారు. అక్కడ ఉండడం నాకు ఇష్టంగా ఉండేది కాదు. అమ్మ, నాన్న, ఇద్దరన్నయ్యలు, చెల్లి గుర్తుకు వచ్చి ఏడుపొచ్చేసేది. ఓసారి మా అమ్మమ్మ పక్కింటివాళ్ళతో 'బెంగపెట్టుకున్నట్టున్నాడు వెర్రి నాగన్న' అని ఏడుపు కంఠంతో చెప్పడం నేను విన్నాను.

అమ్మమ్మ, తాతయ్య నన్ను బాగానే చూసుకునే వారు. అమ్మమ్మ మరీను. వెన్నముద్దలు తినిపించేది. గడ్డపెరుగుతో అన్నం కలిపి గోరుముద్దలు తినిపించేది. ఆ పెరుగు కొంచెం జేగురు రంగులో ఉండి చాలా రుచిగా ఉన్నా, నాకు ఉన్నట్టుండి మా అమ్మ గుర్తుకొచ్చి కళ్ళ వెంబడి నీళ్ళు బుగ్గల మీదికి జారేవి.

ఆ ఊరి ఎలిమెంటరీ స్కూలులో నన్ను ఒకటో క్లాసులో మా తాతయ్య చేర్పించేడు. ఆ ఊళ్ళో తాతయ్య, అమ్మమ్మల దగ్గర ఉండడం, ఆ స్కూలుకు వెళ్ళడం- ఎలా తప్పిపోతుందా అన్న ఆలోచన ఒక్కటే నాలో నిండిపోయింది.

ఓ రోజు స్కూలు ఎగ్గొట్టేశాను. కానీ, ఇంట్లో ఏం తోచక, ఏం చెయ్యాలో తెలీక ఏడుస్తూ నిద్రపోయాను.

ఓ రోజు సాయంత్రం పుస్తకాల సంచీ ఈడ్చుకుంటూ స్కూల్ నుంచి వస్తుంటే స్వామి పలకరించి, నా భుజం మీద చేయి వేశాడు. నేను మోచేత్తో కన్నీళ్ళు తుడుచుకుంటూ, స్వామి చేయి తోసేశాను. ఆ తరువాత కూడా స్వామి నన్ను వదలలేదు. రోజూ క్లాసులో, క్లాసు లేనప్పుడు, ఇంటికి వెళుతూ మాట్లాడుతూ ఉండేవాడు.

ఓ రోజు క్లాసు అయిపోయాక, "దోసకాయలు తిందామా" అన్నాడు స్వామి నాతో.

"వద్దులే."

"తోటల్లో దోసకాయలు చాలా బావుంటాయి. నా దగ్గర ఉప్పు, కారం పొట్లాలున్నాయి. అవి రాసుకుని దోసకాయలు తింటూ ఉంటే..."

"తీసుకెళ్ళు" అన్నాను.

పొలాలు, దొడ్లూ, పశువుల పాకలు దాటాక ఓ చిన్న దొడ్డిలాటి దాంట్లోకి తీసుకెళ్ళాడు.

"ఎన్ని దోసకాయలో! అబ్బ" అన్నాడు స్వామి.

"ఏవీ నాకు కనబడ్డం లేదే" అన్నాను.

స్వామి వంగి ఆ పాదులు, తీగలు నెమ్మదిగా తప్పిస్తుంటే, అక్కడ పచ్చగా ఎన్ని దోసకాయలో!

గబగబా నాలుగు కాయలు తెంపేసి, "వెళ్ళిపోదాం రా. కాలవగట్టున కూర్చుని తిందాం" అంటూ స్వామి తీసికెళ్ళి, నాకో కాయ ఇచ్చాడు. కొరికిన దోసకాయకు ఉప్పూ, కారం రాసి తింటుంటే అబ్బ, ఆ రుచి ఈనాటికీ నా నాలుక మీద ఉండిపోయింది.

కాలువలో స్నానం, ఆలయంలో చెట్టు కింద రాలిన గన్నేరు పూలు ఏరుకోవడం, వరి నాట్లు చూడడం, నాటుతూ ఆ ఆడవాళ్ళు పాడే పాటలు వినడం, పొలంగట్ల మీద పరిగెడుతూ ఆయాసపడడం; ఆకుపచ్చని తోటలూ, పొలాలు చూస్తూ గడపడం, గోచీ పెట్టుకుని బావి దగ్గర స్నానం-ఇవన్నీ నాకు బాగా అలవాటు చేసేశాడు స్వామి.

ఆరు నెలలు గడిచేటప్పటికి ఆ పల్లెటూరు నా కోసమే ఆకుపచ్చగా ఉన్నట్లు, ఊరంతా నా మీద ఇష్టంగా ఉన్నట్లు, అమ్మమ్మ, తాతయ్యలు అమ్మా, నాన్నలుగా అయిపోయినట్లు నాకు అనిపించింది.

నేను మూడో క్లాసులోకి పచ్చేసరికి మా తాతయ్య పెద్ద పెద్ద మీసాలు చూసినా భయం పోయి, ఆ తెల్లని, నల్లని బుంగ మీసాలు నాకు చాలా ఇష్టమైపోయాయి. నాకూ అలా పేద్ద మీసాలు కావాలనిపించింది.

ఓ రోజు స్వామిని "నాకు మీసాలు ఎప్పుడు వస్తాయి" అని అడిగాను.

వాడు కాసేపు ఆలోచించి, "తెలియదు" అని కాసేపు ఆగి, "మన ఇద్దరికి ఒకేసారి వస్తాయనుకుంటాను" అన్నాడు.

నాతో పాటు వాడికీ మీసాలొస్తాయి అని వినడం ఇష్టంగా లేదు. నాకొక్కడికే పేద్ద మీసాలుండాలనిపించి "నాకు మాత్రం మా తాతయ్యలా పెద్ద మీసాలు వస్తాయి" అన్నాను.

"అయితే, సరే" అని స్వామిగాడు ఒప్పుకోవడం నాకు చాలా శమనగా అనిపించింది.

పగటి ఎండ సాయం సంధ్య జేగురు రంగులో కలిసిపోతుండగా కాలువలో మేమిద్దరం ఈదుతూ స్నానాలు చేసేవాళ్ళం. ఆ జేగురురంగు క్రమంగా ఎర్రగా మారడం, ఆ రంగులు కాలువ నీళ్ళల్లో మేం పట్టుకుందామన్న ప్రయత్నంలో చిన్నగా చీకటి కమ్మడం, ఇంటికి వెళ్ళే లోపున వెన్నెల రావడం, జోగుతూ అమ్మమ్మ పెడుతూన్న పెరుగన్నం తినడం, నిద్రపోవడం - అంతా సరదాగా ఉండేది.

వీటికి తోడుగా స్వామిగాడి బామ్మగారు వెన్నెల రాత్రుళ్ళు మమ్మల్ని దగ్గరగా కూచోబెట్టుకుని ఎన్నో కథలు - కథలు కథలుగా బలే చేప్పేది. బామ్మగారు మా తలలు నిమురుతూ, నవ్వుతూ ఎన్నో కథలు, పద్యాలు చెబుతూ వినిపించేది.

స్వామిగాడి బామ్మగారు బోసి నోటితో నవ్వుతుంటే నాకు బలే గమ్మత్తుగా ఉండేది.

ఓ రోజు స్వామిని నేను "నాకు పళ్ళు ఎప్పుడు ఊడిపోతాయి" అని అడిగాను.

"నాకూ, నీకూ రెండు ముందరి పళ్ళు ఊడేయిగా" అన్నాడు స్వామి.

"రెండు, మూడు కాదు - అన్నీ."

"ఏమో! ఎందుకు?"

"పళ్ళు అన్నీ ఊడిపోతే మీ బామ్మగారిలా చక్కగా నవ్వొచ్చు కదా" అన్నాను.

ఆ సాయంత్రం స్వామి, బామ్మగారితో ఈ మాట చెప్పి, "ఎప్పుడు ఊడిపోతాయి పళ్ళు అన్నీ" అన్నప్పుడు, ఆవిడ ఏక నవ్వే - ఆ బోసినోటితో!

మా పల్లెటూళ్ళో అయిదో క్లాసు అయ్యాక నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ఊళ్ళో హైస్కూల్లో జేరాం మేమిద్దరం.


నేను ఫోర్త్‌ఫారంలోకి వచ్చేసరికి మా తాతయ్య నాకు ఓ పొడవు చేతుల తెల్ల చొక్కా కుట్టించాడు. నల్లటి నిక్కరుమీద ఆ తెల్లటి చొక్కా బలే ఉన్నట్లనిపించి, నాకు చాలా గర్వంగా అనిపించింది. ఆ సంవత్సరం మధ్యలో మేమిద్దరం సైకిళ్ళు కొనుక్కుని, సైకిల్ తొక్కుకుంటూ స్కూలుకు వెళ్ళి వస్తూ ఉండేవాళ్ళం.

ఆ సంవత్సరం నాకు తెలిసింది - మా తాతయ్యకు మా అమ్మ తప్ప పిల్లలు లేకపోవడంతో నన్ను దత్తత తీసుకున్నాడని.

మా క్లాసులో చదివే ఆడపిల్లలు ఇద్దరు ఓణీలతో వస్తే, వాళ్ళు ఉన్నట్లుండి చాలా పొడవైపోయినట్లు అనిపించింది. క్రమంగా మా శరీరాల్లో, ఆలోచనలలో, ఊహల్లో మార్పు అర్థం కాక ముడుచుకుపోయేం. నెమ్మదిగా అన్నీ అర్థమవుతూండడంతో సర్దుకున్నాం. రెండేళ్ళుగా స్వామి స్కూలు దగ్గరగా ఉన్న గ్రంథాలయంలో చందా కట్టి పుస్తకాలు తెగ చదివేవాడు. ఆ అలవాటు నాకు కూడా కొంత అబ్బింది. ఆ పుస్తకాల ద్వారా మాకు కొత్త లోకాలకు ద్వారాలు తెరిచినట్టయింది.

స్కూల్‌ఫైనల్లో కూడా స్వామి క్లాసు పుస్తకాలతో పాటు, మిగతావీ చదువుతూనే ఉండేవాడు. ఆ ఏడు మాత్రం నేను చదువు మీదే దృష్టి నిలిపి, ఏకాగ్రతతో చదివాను. ఇద్దరికీ చాలా మంచి మార్కులు వచ్చాయి. మొత్తం మార్కులలో స్వామికంటే నాకు పదహారు మార్కులు ఎక్కువ వచ్చి, స్కూలుకు మొదటివాడిగా వచ్చాను.

ఇద్దరం మెడ్రాస్ వెళ్ళి 'బై.పి' గ్రూపుతో ఇంటర్‌లో



చిత్రాలు: నర్సిం

జేరాం. మెడిసన్ చేసి, పేదలకు సేవ చేయాలని మా లోలోపల బలమైన ఊహ ఉండేది.

ఇంటర్‌లో రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన మునిసిద్దప్ప కలిసి, మాతో పూర్తిగా కలిసిపోయి, తరువాత మా జీవితాల్లోనూ కలిసిపోయాడు.

అతని మాటలు, మాట తీరు మాకు తేడాగా, కొత్తగా, ఏవిటోగా ఉండేది. నాకు కాస్త ఎగతాళి చేయాలని కూడా ఉండేది. మా మాట, మా యాస మునికి కూడా చాలా తేడాగా ఉండేదని, మేం బాగా దగ్గరయ్యాక తెలిసి ఆశ్చర్యపోయాను.

ముని చాలా తెలివైనవాడు. మా ఇద్దరికంటే మంచి మార్కులు వచ్చేవి. పైగా మాంచి స్పోర్ట్స్‌మన్.

ఇంటర్ ఆ రెండేళ్ళలో స్వామి 'కన్నెమెర' లైబ్రరీని ఆరాధనా భావంతో చూసుకుంటే రకరకాల విషయాల మీద ఎన్ని పుస్తకాలు చదివేవాడో!

ఇంటర్‌లో మేం ముగ్గురం ఫస్ట్ క్లాస్‌లో గ్రూప్‌లో డిస్టింక్షన్‌తో పాసయి, మెడిసన్ కోర్స్‌కు దరఖాస్తు చేశాం. ఆ సెలవుల్లో ముని మా ఇద్దరితో మా ఊరికి, మేం ఇద్దరం ముని పల్లెటూరికీ తిరిగి, ఒకే రాష్ట్రంలో ఆ రెండు ప్రదేశాల్లోని భాష, సంస్కృతి, ఆచారాలు, అలవాట్లు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాం. ఆ ప్రయాణాలు, ఆ ఊళ్ళు, ఆ జనం, వాళ్ళ జీవనసరళి, భాష మా ఆలోచనలను దృష్టినీ, అవగాహనను విశాలం చేశాయి. ముని మా ఊరి వైపు మాతో వస్తూ 'అబ్బా! ఎన్ని నీళ్ళో! ఎంత పచ్చదనం! పశువులకి ఎంత గడ్డి!' అని ఆశ్చర్యపోతే ఆశ్చర్యపోవడం మా వంతు కూడా అయింది - నీళ్ళు, పచ్చదనానికి చిన్నప్పటి నుంచి మేము అలవాటు పడ్డంతో.

మా ముగ్గురికీ మెడిసిన్‌లో సీట్ వచ్చింది. మా ఇద్దరినీ ఆశ్చర్యంలో ముంచి, స్వామి హిస్టరీ ఆనర్స్‌లో చేరాడు. ముని, నేను మెడిసన్ మన కెరీర్‌కి మంచిది. ఆ కోర్స్‌లో చేరవద్దని స్వామికి రకరకాలుగా చెప్పాం.

అంతా విని స్వామి "ఇంటర్ సెకండియర్‌లో నాకు తెలిసింది- నా ఆలోచన, పద్ధతి - శాస్త్ర, సాంకేతిక రంగాలకు, వృత్తిపరమైన సబ్జెక్ట్స్‌కి సూటవదనీ, నా ప్రాణం 'హ్యూమానిటీస్'లో ప్రాణవంతంగా, జీవంతో నిలుస్తుందనీ! నేను 'చరిత్ర' లోనే ఆనర్స్ చేస్తాన"ని నెమ్మదిగా, కానీ దృఢంగా చెప్పాడు.

నేనూ, మునీ మెడిసన్‌లోనూ, స్వామి ఆనర్స్‌లో ఉన్నా తరచు కలుస్తూనే ఉండేవాళ్ళం. మా స్నేహం ఇంకా దగ్గరగా అల్లుకుపోయింది. కబుర్లు చెప్పుకుంటూ, అనుభవాలు, అనుభూతులు, ఆలోచనలు కలబోసుకుంటూ ఉండేవాళ్ళం.

ఆ రోజుల్లోనే రేపు పరీక్షకు డబ్బు కట్టవలసి ఉండగా మునికి డబ్బు అందలేదు. నా దగ్గరా సరిపోయినంత లేదు. స్వామి డబ్బు అందించాడు. ఆ తరువాత తెలిసింది, స్వామి ఉంగరం అమ్మేసి ఆ డబ్బు ఇచ్చాడని.

"అదేవిటి? స్వామీ! మీ బామ్మగారు ఇచ్చిన

"పళ్ళు అన్నీ ఊడిపోతే మీ బామ్మగారిలా చక్కగా నవ్వొచ్చు కదా" అన్నాను. స్వామి బామ్మగారితో, "ఎప్పుడు ఊడిపోతాయి పళ్ళు అన్నీ" అన్నప్పుడు, ఆవిడ ఏక నవ్వే - ఆ బోసినోటితో!

ఉంగరం అమ్మేయడం నాకు చాలా కష్టంగా ఉంది" అని ముని నొచ్చుకున్నాడు.

పరీక్ష ముఖ్యం కదా! మా బామ్మే పోయినప్పుడు, ఆ ఉంగరం, ఆ బంగారం నాకు ఏం మిగులుస్తుంది. నేను మంచి పనే చేశానని నా నమ్మకం. ఇక ఆ విషయం మరిచిపోదాం" అని స్వామి ఆ విషయం ముగించేశాడు.

మూడేళ్ళ ఆనర్స్ తరువాత స్వామి పి హెచ్.డిలో జేరి మా మెడిసన్ అయ్యేనాటికి అతనూ 'డాక్టర్' అయ్యాడు. ముగ్గురమూ డాక్టర్లగానే మిగిలాం.

నేను, స్వామి చదువుకున్న హైస్కూలు ఉన్న ఊళ్ళో డిగ్రీ కాలేజీ పెట్టారు.

స్వామి అక్కడ కాలేజీలో లెక్చరర్‌గా, నేనూ, ముని కలిసి అక్కడికి నలభై మైళ్ళ దూరంలో ఉన్న పెద్ద ఊళ్ళో ప్రాక్టీస్ మొదలుపెట్టి, మా జీవితాల్లో ఇంకో దశలోకి అడుగు పెట్టాం. ఆ కాలంలోనే మా ముగ్గురికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. ఆ తరువాత రెండుమూడేళ్ళలో మా అమ్మమ్మ, తాతయ్య, ముని, స్వామి తల్లితండ్రులు పోయారు. మేమే పెద్దవాళ్ళం అయిపోయి, చిన్న పిల్లల్లా అల్లాడిపోయాం.

నాతో ముని కలిసి ఉన్న మొదటి మూడేళ్ళూ మా సంపాదన తగుమాత్రంగానే ఉంది. నాలుగో ఏడు ముని ఎమ్.ఎస్ చేస్తానని వెళ్ళి అది పూర్తిచేయగానే, మద్రాస్‌లో స్థిరపడ్డాడు.

నాకు, మునికి ఇద్దరేసి మగపిల్లలు.

స్వామికి ఒక్కతే ఆడపిల్ల. ముందు పుట్టిన ఆడపిల్ల, మగపిల్లాడు చినతనంలోనే పోయాక ఈ ఆడపిల్ల. సూర్యకాంతం ఆ పిల్ల పేరు. ఎనిమిదో ఏట స్వామి భార్య 'జాండీస్'తో పోయింది. కాంతాన్ని స్వామి తల్లీ తండ్రీ అయి పెంచాడు. మళ్ళీ పెళ్ళి మాటే ఆలోచించలేదు. ఆ తండ్రీ కూతుళ్ళు ఇద్దరి మధ్య గొప్ప అవగాహన ఆ పిల్ల చిన్నప్పటి నుంచే ఉండేది.

ముని వెళ్ళిపోయిన ఏడాది ఒక్కణ్ణీ అక్కడ ఉండలేక, స్వామి ఉన్న ఊరికి వచ్చేశాను. ఇక్కడ నాకు పోటీ తక్కువై మంచి 'ప్రాక్టీస్' అందుకుంది. ఓ చిన్న సైజు నర్సింగ్‌హోమ్ కూడా నడిపే స్తోమత వచ్చింది. రెండు అంతస్తుల ఇల్లు కట్టాను.

ఇద్దరం డాక్టర్లం అవడం వల్ల నేనూ, ముని మా వృత్తికి సంబంధించిన సమావేశాల్లో తరుచుగానే కలుసుకునేవాళ్ళం. స్వామికి ముని, మద్రాస్ వెళ్ళిన మూడు నాలుగేళ్ళు తరుచుగా ఉత్తరాలు రాసినా, ఆ తరువాత తగ్గించేశాడు. స్వామి మాత్రం ఉత్తరాలు క్రమం తప్పకుండా రాస్తూ ఉండేవాడు.

ముని సర్జన్‌గా మంచి పేరు, ఖ్యాతి, డబ్బు గడించాడు. మద్రాస్‌లో పన్నెండేళ్ళు ఉన్న తరువాత ముని కుటుంబంతో 'స్టేట్స్' వెళ్ళిపోయాడు. నేనూ, స్వామి బొంబాయి వెళ్ళి మునికి 'బాన్‌వాయేజ్' చెప్పి వచ్చాం.


అమెరికాలో కూడా ముని సర్జన్‌గా ఖ్యాతి గడించి, బాగా సంపద గడించాడు.

ముని హృద్రోగానికి సంబంధించిన అంతర్జాతీయ సమావేశాలకు ఢిల్లీ, బొంబాయి, కలకత్తా మూడుసార్లు వచ్చాడు. అతనికి సమయం లేక, తనని కలవమని రమ్మని కోరితే, నేను ఒకణ్ణీ వెళ్ళి సరదాగా గడిపి వచ్చేవాణ్ణి. రమ్మనమని అడిగినా స్వామి రాలేక పోవడంతో, తిరిగి వచ్చి నేనే అన్ని విశేషాలూ స్వామికి చెప్పేవాణ్ణి. స్వామి అన్నీ చాలా ఆసక్తితో విని, ముని గురించి, కుటుంబ సభ్యుల గురించి, పిల్లల చదువుల గురించి ఆత్మీయంగా అడిగి తెలుసుకునేవాడు.

* * *

ముగ్గురం అరవైలకు దగ్గరకు వచ్చేశాం. స్వామి కూతురు కాంతం, అల్లుడు భోపాల్‌లో ఉంటున్నారు. పదేళ్ళ క్రితం స్వామి, ఓ చిన్న డాబా ఇల్లు, విశాలమైన స్థలంలో ఊరికి దూరంగా కట్టుకున్నాడు.

మా పెద్ద అబ్బాయి ఎమ్.డి చేసి నా దగ్గరే నాతో కలిసి వైద్యం చేస్తున్నాడు. రెండోవాడు ఇక్కడే లాయర్‌గా ఉన్నాడు. స్వామి కూతురు 'సోషల్





సైన్సస్'లో ఎమ్.ఏ చేసి, 'లా' కూడా పాసయి, భోపాల్‌లో లెక్చరర్‌గా ఉంటోంది. ముని పెద్ద కొడుకు సర్జన్, రెండోవాడు 'ఎటార్నీ'ట.

స్వామి ఇప్పటికీ మన సంస్కృతి, చరిత్ర గతి, అణగారిన సమాంతర జాతుల సంస్కృతీ విలువలు, ఆ విలువల నాణ్యత గురించి వ్యాసాలు ప్రచురిస్తూనే ఉన్నాడు. రిటైరయ్యాక కూడా స్వామి ఉప కులాల, జాతులకు వాళ్ళ లేమి గురించి, అదృశ్యమవుతూన్న వాళ్ళ సంస్కృతి, విలువల గురించి, వీటికి కారణమైన అణిచి ఉంచిన శక్తుల గురించి ఆయా కులాల వాళ్ళకు చెబుతూ, వాళ్ళ కోసం వాళ్ళతో కలిసిపోయి, తాను చేయదలుచుకున్న పనినీ, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధన చేస్తూనే ఉన్నాడు.

ఆ రాత్రి భోజనం చేసి స్వామి ఇంటికి వెళ్ళాను. ముని రాసిన ఉత్తరంలో స్వామి గురించి రాసింది చూపిద్దామని. రాత్రి పది దాటుతోంది. నా కారు శబ్దానికి స్వామి గేటు దాకా వచ్చి, నన్ను లోపలకి తీసుకెళ్ళాడు.

స్వామి గదిలోంచి వస్తున్న ఏదో సంగీత వాద్యం సన్నని సవ్వడి ఆ ఇంటినంతా శాంతంగా ఉంచుతోన్నట్టు పరుచుకుంటోంది. ఆ సంగీతానికి పరిమళం కూడా అద్దబడినట్లు స్వామి గదిలోకి రాగానే సువాసనలు నన్ను తాకాయి. దూరంగా ఆ గది మూలలో స్టూల్ మీద రెండు గిన్నెలలో మల్లెలు, జాజులు విచ్చుకుంటున్నాయి.

"ముని ఉత్తరం రాశాడు. నీకూ చూపించ మన్నాడు" అని ఉత్తరం అందించాను.

"భోజనం చేసేవా? లేక ఆఖరి పేషెంట్ తరువాత నాకోసం వచ్చేశావా? లే, భోజనం చేద్దువుగాని."

మా అబ్బాయి వచ్చాక నాకు పనీ, ప్రాక్టీస్ తగ్గాయిగా! వచ్చిన ప్రతివాడూ, 'సుందరం డాక్టరుగారు లేరాండీ' అని నన్నే అడగడం. జెలసీ కాదుగానీ, నాకు కాస్త చిన్నతనం గానే ఉంది సుమీ! భోజనం చేశానులే" అన్నాను.

స్వామి చిన్నగా నవ్వుతూ, "వృత్తిపరమైన జెలసీస్ ఉంటాయి కాని, సుందరం అంటే కూడా నీకు కాస్త అసహనంగా ఉందే! మీ అబ్బాయి ఎమ్.డి కదా. రోగుల ఆలోచన రైటే కదా! నీవు నెమ్మదిగా రిటైరై నీ కోసం నువ్వు బతికితే నీకు ఇలాటి ఇబ్బందులు ఉండవేమో ఆలోచించు" అన్నాడు.

ఇంతలో లోపల్నుంచి సూర్యకాంతం వచ్చి "ఎలా ఉన్నారు బాబాయ్! భోజనం చేద్దురుగాని రండి" అంది.

"అన్నం తిన్నాను గానీ - నువ్వు ఎప్పుడొచ్చావ్? చెప్పలేదేమిటి స్వామీ" అన్నాను.

"నాలుగురోజులైంది వచ్చి. ఎల్లుండి మీ ఇంటికి వద్దామనుకుంటున్నాంలే" అని స్వామి, ముని ఉత్తరం చదివి ఇచ్చేస్తూ, "మునికి 'రూట్స్' ఇంకా ఇక్కడే ఉన్నాయి. ఎంత ఇష్టం, ప్రేమ కలగలిపి రాశాడు అంత దూరం నుంచి" అన్నాడు.

మూడు రోజులు తరువాత ఆదివారం వాళ్ళిద్దరూ మా ఇంటికి వచ్చి భోజనం చేసి, రాత్రి దాకా కబుర్లు చెప్పి వెళ్ళారు. మా ఆవిడకు కాంతి అంటే ఇష్టం, స్వామి అంటే గౌరవం.

ఇన్నేళ్ళబట్టీ స్వామి ఒక్కడే ఉంటూ, వంట చేసుకుంటూ గడపడం తలుచుకుని మా ఆవిడకు బెంగగా ఉండి, బాధపడుతూ ఉంటుంది.

ఆ తర్వాత పది రోజులకు నేనూ, మా ఆవిడా స్వామి ఇంట్లో భోజనం చేసి కబుర్లు చెప్పుకుంటుండగా మా ఆవిడ, "కాంతం, మీ ఆయన నీకోసం బెంగెట్టుకోడు కానీ, నువ్వు నెల్లాళ్ళు నాన్న దగ్గర ఉండు" అంది రుద్ధ కంఠంతో.

"నేను భోపాల్ వెళ్ళడం లేదు పిన్నిగారూ! ఇక్కడే ఉంటాను" అంది కాంతం.

అప్పుడు కాంతం మాటల్లో అర్థం మా ఇద్దరికీ అందలేదు. ఆ తరువాత కాంతం మా ఆవిడతో చెప్పినవి, స్వామి చెప్పినవి కలబోసుకుంటే ఆ మొగుడితో కాంతం కలిసి ఉండడం ఎంత దుర్భరమైన విషయమో మా ఇద్దరికీ తెలిసివచ్చింది. ఇన్నేళ్ళూ తండ్రిని తలుచుకుని భరించడం తలుచుకుంటేనే మాకు దుఃఖం కలిగింది.

అసలు విషయం నా మాటల్లో చెప్తాను:

అతడు గట్టిగా ఏమీ దెబ్బలాడడు. కానీ, సన్నని మంట కాల్చినట్టుగా పొగ చూరిపోయేట్టు, తెలీకుండా కాలిపోయేట్టు చేయడంలో దిట్ట. ఉద్యోగం, దాంట్లో పై మెట్లు ఎక్కడానికి ఎత్తులు వేయడం, డబ్బు, బంగారం, ఆస్తి, ప్లాట్లు సంపాదించడం, సంపద పోగేయడం- ఇదే యావ. కాంతం కూడా అలాగే ఉండాలి. కాంతం అంతా నిండి ఉన్న సున్నితత్వాన్ని హరించేసే, కాల్చేసే మాటలు, చేతలు. కాంతానికి ఇష్టమైన ఏ పనులూ చేయనీయకుండా, ఇంటిని ఓ మూగ జంతువులా, కాంతం జీవితం ఎండిపోయేట్టుగా, లోపలి జవం, జీవం హరించుకుపోయేట్టు హద్దులు, ఆంక్షలు.

అన్నేళ్ళయినా పిల్లలు కలగకపోవడంతో కాంతం అన్ని పరీక్షలూ చేయించుకుని, తన లోపం లేదని తెలుసుకొని, అతన్ని పరీక్ష చేయించుకోమంటే,

> మెడిసన్ చేసి, పేదలకు సేవ చేయాలని మా లోలోపల బలమైన ఊహ ఉండేది. రాయల సీమ నుంచి వచ్చిన మునిసిద్ధప్ప కలిసి, తరువాత మా జీవితాల్లోనూ కలిసిపోయాడు.

"నేను మగవాణ్ణి. నాకేం లోటు ఉంటుంది. నువ్వు గొడ్రాలివి" అని హింసించిన మూర్ఖుడు.

ఇక అతనితో సాహచర్యం, జీవితం తనలోని ప్రాణ వంతమైన స్పందనల్నీ, మిగిలి ఉన్న చైతన్యాన్నీ, సూనృతాన్నీ కోల్పోయి, జీవం ఉన్న కట్టెలా మిగిలి పోవాలని కాంతానికి తెలిసివచ్చింది. అతనితో ఉంటే ఉన్న మనిషితనం కాస్తా పోతుందన్న నమ్మకం కుదిరాక, విడిపోయి విడాకులు తీసుకుని వచ్చేసింది. పది రోజుల క్రితం ఇంకో అమ్మాయి మెడలో ఇంకో ఉరితాడు మూడు ముళ్ళుగా బిగించాడని వాడు పంపిన శుభలేఖ ద్వారా కాంతానికి తెలిసింది.

"మరి ఇప్పుడేం చేస్తావు కాంతం" అన్నానో రోజు.

"చేయాలంటే ఎన్ని పనులు లేవు బాబాయ్ గారూ. ప్రస్తుతానికి మా నాన్నకి 'కంపెనీ' ఇస్తున్నాను. నాకు చాలా హాయిగా, సంతోషంగా, మనశ్శాంతిగా ఉంది" అంది కాంతం.

మూడు నెలల తర్వాత ఈ ఊళ్ళో కాలేజీలో చేరింది. సాయంకాలాలు వంచితులైన స్త్రీలకు న్యాయశాస్త్రం ప్రకారం ఉన్న రక్షణలు, హక్కులు చెబుతూ వాళ్ళకు కోర్టులలో న్యాయం జరిగేందుకు కృషి చేస్తోంది.

ఆరు నెలల తర్వాత ముని ఫోన్ చేశాడు. హైదరాబాద్ నుంచి మాట్లాడుతున్నానన్నాడు.

"హైద్రాబాద్ ఎప్పుడు వచ్చావ్" అన్నాను.

"మూడు నెలలైంది."

"మరి ఇప్పటిదాకా..." అని నేను అంటుండగా-

"జూబ్లీ హిల్స్‌లో ఇల్లు కొన్నాను. మా పెద్ద అబ్బాయి కుమార్‌ని నాతో తీసుకుని ఇండియా వచ్చేశాను" అని ఆగాడు.

"అదేవిటీ? కుమార్ టెక్సాస్‌లో సర్జన్ కదా" అన్నాను.

"అన్నీ కలిసినప్పుడు వివరంగా చెప్తాను. నువ్వూ, స్వామి ఇక్కడకు ఓసారి రాగలరా? వస్తే బాగుంటుంది" అని ఫోన్ పెట్టేశాడు.

స్వామిని కలిసి ముని ఫోన్ గురించి చెబుతుంటే, "నాకూ ఫోన్ చేశాడు. రేపు బయలుదేరుదాం. టికెట్లు తీసుకున్నాను" అన్నాడు.

స్వామి తన పద్ధతిలో మామూలుగా అంటున్నా, ఎందుకంత వెంటనే టికెట్లు తీసుకున్నాడు? స్వామితో ముని నాతో చెప్పనివి ఏవైనా చెప్పాడా?

"నీతో ఏం చెప్పాడు? విషయం ఏమిటీ" అని అంటుండగా-

"వెళ్తున్నాం కదా. ఇద్దరం కలిసి విందాం. ముగ్గురం మాట్లాడుకుందాం" అని ఊరుకున్నాడు స్వామి.

స్వామి పద్ధతి తెలిసిన నేను అతనిక ఏవీ చెప్పడని తెలిసి ఊరుకున్నాను.

సికిందరాబాద్ స్టేషన్‌లో ముని మా ఇద్దరినీ కలిసి, ఇంటికి బెంజ్ కారులో తీసుకెళ్ళాడు. ఆ పెద్ద కారులో ప్రయాణం పులిమీద స్వారీ చేస్తున్నట్టు అనిపించింది. భవంతి లాంటి పెద్ద మేడ. ఇల్లంతా మార్బుల్, గ్రానైట్‌తో మెరుస్తోంది.

బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటుండగా, "ఎన్నాళ్ళయింది స్వామీ నిన్ను చూసి, నీ మాటలు విని" అన్నాడు ముని.

ఆ రాత్రి డిన్నర్ దగ్గర ముని, కుమార్‌ని పరిచయం చేశాడు. చిన్నతనంలో చూశాం. ఆ పిల్లాడిని. డిన్నర్‌లో కుమార్ చూపులు ఏవిటోగా, శూన్యంలోకి చూస్తున్నట్టుగా నాకు అనిపించాయి.

"ఎలా ఉంది ఇక్కడ? టెక్సాస్‌కు ఎప్పుడు ప్రయాణం" అన్నాను కుమార్‌తో.



"తెలియదు" అని ఊరుకున్నాడు కుమార్.

డిన్నర్ ముందు నేను విస్కీ తీసుకున్నాను. భోజనం చేయగానే 'నాకు నిద్రగా ఉంది' అనేసి గదిలోకి వెళ్ళిపోయాను. పక్క గదిలో ముని, స్వామి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ మాటలు నెమ్మదిగా వినబడుతూన్నా. నేను నిద్రలోకి జారిపోయాను.

మర్రోజు నేను ఆలస్యంగా లేచాను. గదిలో స్వామి లేడు. నాకు ఏక తలనొప్పి. కాఫీతో ఓ సారిడాన్ మింగి పేపరు చూస్తూ కూచున్నాను.

లంచ్ సమయానికి స్వామి వచ్చాడు.

"ఎక్కడికి వెళ్ళావ్" అన్నాను.

నేను, కుమార్ కలిసి ఉన్నాం. ఇంట్లో, గార్డెన్‌లో తిరుగుతూ, ఊళ్ళో కాసేపు, అతని గదిలో అలా అలా మాట్లాడుతూ గడిపాను" అన్నాడు స్వామి.

ఆ రాత్రి ముని మమ్మల్ని రైలు ఎక్కించి వెళ్ళిపోయాడు.

"ముని కొడుకు చూపులు గమనించావా? మాటలు కూడా పొంతన లేకుండా ఉన్నాయనిపించింది నాకు" అన్నాను స్వామితో.

"కల్చర్ క్లేష్, కాన్‌ఫ్లిక్ట్. సంస్కృతి, అలవాట్లు..."

"నేను కుమార్ గురించి అంటుంటే, సంస్కృతి అంటావేమిటి స్వామీ" అన్నాను కాస్త చిరాగ్గా.

అది కుమార్‌కు సంబంధించినదే. కుమార్ కోసమే ముని మనల్ని హైద్రాబాద్ రమ్మన్నాడు. మన ఊరు వెళ్ళాక సావకాశంగా అన్నీ మాట్లాడుకుందాం. పడుకో" అని నాకు రగ్గు కప్పి, లైట్ తీసేశాడు.

మర్రోజు స్వామి చెప్పాడు:

"కుమార్ ఈ దేశంలో పుట్టి, ఇక్కడ చాలా కాలం పెరిగాడు. ఈ దేశానికి అలవాటుపడిన ఆ కుర్రాడు తల్లి, తండ్రి, తమ్ముడితో టెక్సాస్ వెళ్ళి సర్జన్ అయ్యాడు. హాస్పిటల్‌లో పరిచయమైన 'సిండీ'ని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. కుమార్‌కు పిల్లలంటే పిచ్చి ఇష్టం. ఆ అమ్మాయి అయిదేళ్ళదాకా ఆ విషయం మరచిపోయింది. కుమార్‌కు అది మొదటి షాక్. ఆమె అలవాట్లు, తిరుగుళ్ళూ, డిస్కోలలో తాగుతూ, విశృంఖలంగా అందరితో డాన్స్- ఇవి తగ్గించమంటే 'యూ, పూర్ ఫెలో' అన్నట్టు సిండీ చూసిన చూపు రెండో షాక్. తన భార్య పెళ్ళి అయిన మూడో ఏట జిమ్మీ అనే మెక్సికన్ కుర్రాడితో తిరగడం, ఇంటికి తీసుకురావడం, తను ఉండగానే వాళ్ళిద్దరూ తాగడం, తాను చూస్తుండగానే బయటకు వెళ్ళిపోవడం- మనవాడు భరించలేక పోయాడు. భార్యతో గొడవ పడ్డాడు. గొడవ బాగా ఎక్కువైన సమయంలో సిండీ కిచెన్ నైఫ్ చూపించి, "మాటలు సరిగా రానీ. యూ, ఫూల్" అని ఇంట్లోంచి వెళ్ళిపోయి పదో రోజున వచ్చిందట- హుషారుగా 'హమ్' చేసుకుంటూ.

"ఏవిటా తిరుగుళ్ళు? ఎక్కడకెళ్ళావ్?"

"నేనూ, జిమ్మీ హాలిడే రిసార్ట్‌కి వెళ్ళాం."

"మనం ప్రేమించుకున్నాం. ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాం."

"అది మూడేళ్ళ మాట. ఐ లవ్ జిమ్మీ! విడిపోదాం" అని విడాకులు తీసేసుకుంది.

"అంతలా ప్రేమించిన అమ్మాయి, భార్య విడిపోయి, వెళ్ళిపోవడమన్నది కుమార్ తట్టుకోలేక పోయాడు. డ్రగ్స్‌కి అలవాటుపడి, ఎడిక్ట్ అయి పోయాడు. ముని హాస్పిటల్‌లో చేర్చి కొడుకుని నెమ్మదిగా డ్రగ్స్ నుంచి తప్పించి వైద్యం చేయించి కాస్త మామూలు మనిషిని చేశాడు. ఇక్కడకు తీసుకొచ్చేశాడు. ఇక వెనక్కి వెళ్ళరట. కుమార్ మళ్ళీ మామూలుగా మనుషుల్లో కలిసిపోయి, గాడిలో పడేట్టు ఏం చేద్దాం అని ముని అడిగాడు.

ఈ ఊరికి మారిపొమ్మన్నాను. ఇక్కడ ఊళ్ళు తిప్పి ఈ గాలికీ, నీటికీ, జనానికీ దగ్గర చేస్తే కుమార్ తన దారి తాను వెతుక్కుంటాడని నా నమ్మకమని చెప్పాను."

మూడు నెలల తరువాత జూబ్లీ హిల్స్‌లో ఇల్లు అమ్మేసి, ముని కొడుకుతో ఈ ఊరు వచ్చేశాడు. ఇక్కడో ఇల్లు కొన్నాడు. మా అరవయ్యోపడిలో మళ్ళా ముగ్గురం ఓచోట జేరాం.

స్వామి కుమార్‌కు మా చిన్నప్పటి పల్లెటూరు, మా హైస్కూలు ఉన్న ఊరు చూపించి, ఊళ్ళు తిప్పి కాలువలతో, పంటలతో జీవంతో తొణికిసలాడే ప్రకృతికి దగ్గర చేసి, ఇంత సంపద మధ్య కష్టించినా కష్టాల ఊబిలో మగ్గిపోతున్న సామాన్య జనానికి పరిచయం చేసి, ఓ నెల్లాళ్ళు తనతో తిప్పుకుని వచ్చాడు. కుమార్‌కి మేము ఉంటూన్న ఊరు, వాడ అంతా చూపించి... లేమితో, చదువులేక, తిండి లేక, ఆదుకునే వాళ్ళు లేక దుర్భరమైన జీవితాలు గడుపుతూన్న జనాలలోకి తీసికెళ్ళి, ఆ పరిస్థితులు, వాటికి వెనక ఉన్న కారణాలు చెప్పి అన్నిటినీ పరిచయం చేశాడు.

"కుమార్ నీవు విడిచి వెళ్ళిపోయిన ఈ దేశపు ప్రజల బలం, బలహీనత రెండు నెలలుగా చూస్తున్నావ్. ఇక్కడి ధూళి, దుమ్ము, అజ్ఞానం, దరిద్రం, నిరక్ష రాస్యతలకు, ఇక్కడి జనం మంచితనానికి, సహనా నికి - వీటన్నిటికీ నీవు అలవాటు పడితేకాని, మనం జనంలో కలవలేం, వాళ్ళూ మనని దూరంగానే ఉంచుతారు. దేశ జనాభాలో వీళ్ళే ఎక్కువ. నీలాటి వాళ్ళ సాయం వీళ్ళకి అందించగలితే ఉపయోగం" అని మా అందరి మధ్య స్వామి చెప్పాడు.

ఓ రోజు ముని "ఇక ఏం చేద్దాం? మీరు చిన్నప్పుడు చదువుకున్న ఊళ్ళో ఓ హాస్పిటల్ కాంప్లెక్స్ ప్లాన్ చేస్తే ఎలా ఉంటుంది? కుమార్ కూడా 'ఎంగేజ్' అవుతాడు. అక్కడి జనాలకు సేవచేసినట్టుంటుంది. అందరం అక్కడకు వెళ్ళిపోదాం" అన్నాడు.

స్వామి, "మునీ! మనం ఇంటర్ చదువు తున్నప్పుడు నువ్వు వెళ్ళిన ఆ పల్లెటూరు కాదు ఆ ఊరు ఈనాడు. ఈ నలభై ఏళ్ళల్లో అక్కడా అన్ని రకాల జాడ్యాలు, కాలుష్యాలు చేరిపోయాయి. మనం జనంతో కలిసిపోయి, వాళ్ళ అవసరాలు గుర్తించి, ఏదైనా చేయాలనుకుంటే, ఎక్కడైనా మనలాటి వాళ్ళ అవసరం ఉంది. ఈ ఊళ్ళో కూడా, ఇక్కడ జనాలతో మనమే మన చిన్న ప్రపంచాలు ఏర్పాటు చేసుకుంటే... జనసామాన్యానికి ఉపయోగం, మనకి శాంతి మిగులుతాయి. ముందు ఓ 'ట్రస్ట్' ఏర్పాటు చేద్దాం. ఆ తరువాత ఇక్కడే ఏదైనా ప్లాన్ చేద్దాం" అన్నాడు.


ముని "నా దగ్గర చాలా డబ్బు మూలుగుతోంది. నేను ముందు పదీ లక్షలు ఇస్తాను. ట్రస్ట్‌కు స్వామి 'చైర్‌పర్సన్'. సభ్యులను స్వామి చెప్తాడు" అన్నాడు హుషారుగా.

నేనూ, మా అబ్బాయిలు సుందరం, చంద్రం, కాంతం, స్వామి ట్రస్ట్ మూలధనానికి మా వంతు సొమ్ము అందించాం. ఆ ట్రస్ట్ విధులు, బైలాస్... ఇవన్నీ కుమార్, చంద్రం, కాంతం, స్వామి తయారు జేశారు. ట్రస్ట్ రిజిస్టర్ చేశాం.

"ముందు ఊళ్ళో ఉన్న అనాథ శరణాలయాన్ని దత్తత తీసుకుందాం. వీధుల్లో, రైలు స్టేషన్లలో తిరిగే పిల్లలను ఓ చోట చేర్చి, చదువు, చిన్న చిన్న పనులు నేర్పిద్దాం, దానికో ఇల్లు కొని, ఓ టీచర్‌ని, ఆయాని కుదుర్చుకుందాం. మనకు వాడలో... పనిచేయడానికి వలంటీర్స్‌ని - ఆడపిల్లలైతే బావుంటుంది - ఎన్నిక చేసుకుని, ముందు వాళ్ళని 'మోటివేట్' చేద్దాం. ఓ

లీగల్ ఎయిడ్ సెల్ మొదలెడదాం. చంద్రం, కాంతం ఆ విషయం చూస్తారు" అన్నాడు స్వామి ఓ రోజు.

ఊరికి దూరంగా, వాడకు అందుబాటులో కుమార్ ఓ 'క్లినిక్' మొదలుపెట్టాడు. వైద్య, ఆరోగ్య, న్యాయ సంబంధమైన సహాయం అవసరమైన స్త్రీల బాధలు, కష్టాల కడలిలో కొట్టుకుపోతున్న సామాన్య జనం దైన్యం చూసి కుమార్, ముని తల్లడిల్లిపోయారు మొదట్లో.



స్వామి వాళ్ళ తల్లితండ్రులతో మాట్లాడి, ఒప్పించి ఎనిమిది మంది కాలేజీ ఆడపిల్లల్ని వలంటీర్స్‌గా తీసుకున్నాడు. వాళ్ళు ఏం చేయాలో, ఎందుకు చేయాలో చెప్పి, ఆ పిల్లలతో కాంతి, నా భార్య సుమతి, స్వామి ఆ వాడలో తిరిగారు. మూడు నెలల్లో ఇరవై ఆరుమంది ఆడపిల్లలు ఉత్సాహంగా, క్రమ శిక్షణతో పనిచేయడం మొదలుపెట్టారు.

అనాథ శరణాలయం పిల్లలకు బట్టలు, చెప్పులు, పుస్తకాలు, చదువు - వీటన్నిటినీ ముని చూసు కుంటున్నాడు. నేను లీగల్ సెల్‌లో కూచుంటూ ఆ పనిలో మునిగిపోయాను. వీధుల్లో తిరిగే ఇరవై మంది పిల్లల విషయం సుమతి, మా కోడళ్ళు చూసుకోవడం మొదలు పెట్టారు.

రెండేళ్ళ తరువాత ముని, "చేయదల్చుకుంటే ఎక్కడైనా మంచి చేయొచ్చు అన్నావు స్వామీ! - ఇప్పుడు, ఇక్కడ ఆ ప్రయత్నం మొదలుపెట్టాం. ఊళ్ళోంచి, పొరుగు ఊళ్ళ నుంచి మన ట్రస్ట్‌కు సొమ్ము అందుతోంది. ఇక్కడ సామాన్య జనానికి ఎన్ని అవసరాలు, ఎన్ని ఇబ్బందులు ఉన్నాయో తెలిసివస్తోంది" అని కళ్ళ నీళ్ళు తుడుచుకున్నాడు.

కాసేపు ఆగి "మా ఆవిడ సుభద్ర, ఎటార్నీగా సెటిల్ అయిన మా రెండోవాడు శేఖర్ కూడా వచ్చే నెలలో ఇక్కడకు వచ్చేస్తున్నారు" అన్నాడు ముని.

ఓ రోజు రాత్రి పొద్దు పోయాక కుమార్ నా దగ్గరకు వచ్చి "స్వామిగారితో మాట్లాడాలి వస్తారా" అని అడిగాడు.

స్వామి దగ్గరకు వెళ్ళాం.

"ఇంత రాత్రి వచ్చినందుకు ఏవీ అనుకోవద్దు అంకుల్! ఓ విషయం మిమ్మల్ని అడుగుదామని వచ్చాను" అన్నాడు కుమార్.

"చెప్పు" అన్నాడు స్వామి.

"మీ అనుమతితో కాంతాన్ని పెళ్ళి చేసుకుందా మనుకుంటున్నాను. మీరు..."

స్వామి ఆలోచించి "కాంతంతో మాట్లాడావా" అన్నాడు.

ఈ లోపున కాంతం లోపలి నుంచి వచ్చి "మీ అనుమతి కోరుతున్నాం నాన్నా" అంది.

"ఇంకేం మరి. శుభం. శుభస్య శీఘ్రం" అన్నాను సంతోషంతో.

"సరే" అని అంటున్నప్పుడు స్వామి కళ్ళు తళుక్కుమని మిలమిల మెరిశాయి.

కాంతం, కుమార్ నెల్లాళ్ళలో రిజిస్ట్రార్ ఆఫీసులో సంతకాలు చేశారు.

బయటకు వస్తూ కుమార్ "ఈ రోజు నుంచీ నిన్ను 'కాంతీ' అని పిలుస్తాను. సమ్మతమేనా" అన్నాడు కాంతంతో. కాంతం అతని చేతిలో చేయివేసి, ముందుకు కదిలింది.

కుమార్, కాంతం స్వామి డాబా మీద నాలుగు గదులు కట్టుకొని, అక్కడే ఉండేవారు.

రెండేళ్ళ తరువాత నేను, ముని ఆఫీసులో ఉండగా, ఆ ఊరి మునిసిపల్ ఛైర్‌పర్సన్, ఓ పది మంచి ఛోటా నాయకులతో వచ్చి, మమ్మల్ని కలిసి "మునిగారూ! మా ఊరికి మీరు చాలా చేస్తున్నారు. మీ ముగ్గురికీ వీర సన్మానం చేద్దామనుకుంటున్నాం. ఎమ్.ఎల్.ఏ గారు మిమ్మల్ని సన్మానిస్తారు. మీరు మాకు ఈ అవకాశం ఇవ్వాలి" అన్నారు.

"ఇలాటివి మాకు తెలీదు. స్వామి ఏవంటాడో విందాం. అతను చెప్పిందే మా మాట" అన్నాం. అందరం స్వామి దగ్గరకు వెళ్ళాం.

మేమందరం వెళ్ళే సమయానికి స్వామి ఫోన్‌లో వింటూ "నా శుభాకాంక్షలు. కాంతానికి కూడా అందించు" అని ఫోన్ పెట్టేసి "కాంతానికి ఆడపిల్ల. హాస్పిటల్ నుంచి కుమార్ ఇప్పుడే ఫోన్ చేశాడు" అన్నాడు.

మా ఆడవాళ్ళందరూ పదిగంటలుగా హాస్పిటల్‌లోనే ఉన్నారు.

మాతో వచ్చిన వాళ్ళ మాటలు విని స్వామి "మీరు వేసే పూల దండలు, అలంకరించే పూల కిరీటాలూ, కప్పే దుశ్శాలువలు, అందించే సన్మాన పత్రం స్వీకరించడానికి మేమేమీ గొప్పగా చేసిందేమీలేదు. ఆ బరువులు మాకు వద్దు లెండి సుబ్బారావుగారూ! మేం చేసే దానికంటే ఓ సంస్థగా మీరు ఎక్కువగా చేయడానికి మీకు ఉన్న వీలు ఎక్కువ.

ముందుగా వాడలో ఓ రోడ్ వేయించండి. ఓ పది మంచినీళ్ళ బోరులు వేయండి. ఓ బావి తవ్వించండి. అక్కడ ఓ ఇరవైమందికి తలా ఒక ఎకరం భూమి ఉంది. ఆ పొలాలకు నీరు అందక అవన్నీ బీళ్ళుగా మారిపోతున్నాయి. ఆ పొలాలకు నీరు అందేందుకు మీ పరపతి ఉపయోగించండి. ఇలాటి వాటికన్నీ మా ట్రస్ట్ కూడా వీలున్నంత సాయం చేస్తుంది. వ్యక్తులుగా మా సహకారం అందిస్తాం. అందరం కలిసి పనిచేద్దామా" అన్నాడు.

"అలా అంటారా?" అని వాళ్ళు "తరువాత వస్తాం" అని వెళ్ళిపోయారు.

స్వామి పెదవుల చివరల్లో చిరునవ్వు మెరిసింది.

ఇంకో ఆరునెలలకు కాంతం, కుమార్ వాళ్ళ ఇంట్లో మా అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు.

డిన్నర్ అయ్యాక కాంతం పిల్లని తీసుకువచ్చి తండ్రి ఒడిలో పడుకోబెట్టింది. ఆ చిన్నది ఏక నిద్ర పోతోంది. కాంతం, కుమార్, స్వామి దగ్గరకు వచ్చారు.

"ఈ పిల్లకు పేరు పెట్టండి నాన్నా" అంది కాంతం. కుమార్ తమకం నిండిన సంతృప్తితో పిల్లను చూస్తున్నాడు.

స్వామి, "చూడండ్రా - ఈ చిన్నది నిద్రలో కూడా నవ్వులు చిందిస్తోంది. ఎవరిని చూసి ఆ చిరునవ్వులు అంటారు? ఈ లోకంలోకి వచ్చినందుకు ఆశ్చర్యంతో తన గురించి తనే నవ్వుకుంటోందా! లేక మనల్ని చూసి నవ్వుతోందా? ఆకాశంలో సగమైన ఈ పిల్ల భూమి మీదకు మన మధ్యకు దిగింది. ఈ శిశువు కొత్త శతాబ్దానికి చెందినది..." అంటూండగానే, పిల్ల ఉలిక్కిపడినట్టయి, కళ్ళు తెరిచి, చిన్న నోరు తెరిచి కెవ్వుమని ఏడుపు మొదలెట్టింది.

"ఒక్క నిమిషం నాన్నా! దానికి ఆకలి అను కుంటాను" అని కాంతం పిల్లని లోపలికి తీసుకెళ్ళింది. పది నిమిషాల్లో పిల్లకి జుబ్బా, చెడ్డీ, నేపీ మార్చి తీసుకొచ్చింది.

తాత ఒడిలో ఆ పిల్ల అందరినీ చూస్తూ, చేతులు అటూ, ఇటూ తిప్పుతూంటే -

"మెలకువలో కూడా నవ్వులు చిందిస్తోంది. ఈ పిల్ల జీవితంలో అపురూపమైన ఆ చిరునవ్వు నిలుపుకొని, తన పరిధిలోకి వచ్చేవాళ్ళ హృదయాల్లో చిరునవ్వులు నిలుపుతుందనే అనుకుందాం" అని పిల్లకేసి నవ్వుతూ చూస్తున్నాడు స్వామి.

"పిల్లకు పేరు పెట్టమంటే, చిరునవ్వులు, కొత్త శతాబ్దం, ఆకాశంలో సగం అంటాడేవిట్రా ఋషీ ఈ స్వామి." అన్నాడు ముని నాతో.

"నాన్న పిల్లకు పేరు పెట్టేశారుగా" అంది కాంతం.

"పేరు పెట్టారా? ఎప్పుడు" అన్నాం అందరం.

"ఇప్పుడే కదా" అంది కాంతం.

"ఏం పేరు పెట్టారు కాంతీ" అన్నాడు కుమార్.

"అపురూప." ■

> "మెలకువలో కూడా నవ్వులు చిందిస్తోంది. ఈ పిల్ల జీవితంలో అపురూపమైన ఆ చిరునవ్వు నిలుపుకొని, మన హృదయాల్లో చిరునవ్వులు నిలుపు తుందనే అనుకుందాం."